సాక్షి ప్రకాశం

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



ఆటో ఢీకొని ఒకరు మృతి

మిరప కోతలకు వెళ్తున్న కూలీల ఆటోను ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా 9 మందికి గాయాలయ్యాయి.

- 18లో..



ఆధార్ గుర్తింపుతో పెన్షన్ కానుక

బయోమెట్రిక్ బదులుగా ఆధార్ ముఖ గుర్తింపుతో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రయోగాత్మకంగా చేపట్టారు.

- 18లో..

గరిష్టం/కనిష్టం
30 /21

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

సైకిల్ యాత్ర చేస్తున్న మహిళకు కలెక్టర్ అభినందన



ఆశామాల్వియతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: మహిళల భద్రత, సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశ వ్యాప్తంగా సైకిల్ ర్యాలీ చేపట్టిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశామాల్వియను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. గత ఏడాది నవంబర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించిన ఆశా గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లో సైకిల్ యాత్ర చేసి బుధవారం ఒంగోలు చేరుకున్నారు. ఒంగోలు చేరుకున్న ఆశామాల్వియా జిల్లా కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెతో సైకిల్ యాత్రపై చర్చించి ధైర్యంగా సమాజంలో మార్పు కోసం కృషి చేస్తున్న ఆమెను అభినందించి యాత్ర విజయవంతంగా ముగించాలని ఆకాంక్షించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- డీఈఓ విజయభాస్కర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయభాస్కర్

ఒంగోలు టౌన్: ప్రతి పాఠశాలలో చదువులో వెనకబడి ఉన్న పదో తరగతి విద్యార్థుల పట్ల దృష్టి సారించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో బి.విజయభాస్కర్ సూచించారు. డీఈఓ అధ్యక్షతన కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో బుధవారం ఒంగోలు డివిజన్ ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఒక గంట ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, అన్ని తరగతులకు సంబంధించిన సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటులో ఆయా పాఠశాలలకు కేటాయించిన సబ్జెక్టు టీచర్స్‌ని వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో కంప్లయింట్ బాక్సును ఏర్పాటు చేసి దానిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నాడు-నేడులో వచ్చిన నిధులను నిబంధనల మేరకు వెంటనే ఖర్చు చేయాలని, కన్సిటెంట్ రిథమ్ యాప్‌లో వచ్చిన టికెట్లను రిజాల్వ్ చేయాలని చెప్పారు. సమావేశంలో ఒంగోలు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి అనిత రోజ్ రాణి, ఏఎస్ఓ జె.కృష్ణ కుమార్ పాల్గొన్నారు.

తీయని వేట..!

విమాన వేగంతో ఆకాశంలో నిరంతరం సంచరిస్తూ నల్లమల అభయారణ్యంలోని పక్షి జాతులకు మకుటం లేని మహారాజులు ఈ గద్దజాతి పక్షులు. అభయారణ్యంపై నిరంతర నిఘాతో ఆకాశం నుండే ఆహారాన్ని గుర్తించి, క్షణంలోనే దానిపై వాలి సేకరించటం ఈ పక్షుల ప్రత్యేకత. గద్ద జాతిలో అరుదైన గద్ద హనీ బజార్డ్. తేనెను మాత్రమే ఆహారంగా తీసుకుని జీవించే ఇటువంటి ప్రత్యేక ఆహారపు అలవాట్లు కలిగిన హనీ బజార్డ్ గద్దపై ప్రత్యేక కథనం..

- తేనెను మాత్రమే తిని జీవించే ఓ జాతిగద్ద హనీ బజార్డ్
- గద్ద జాతుల్లోనే ఓ ప్రత్యేకమైన పక్షి
- పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే గద్దలు
- నైతిక ధైర్యానికి నిదర్శనం



హనీ బజార్డ్...

పెద్దదోర్నాల: అభయారణ్యంలోని క్రిమి కీటకాలు, వన్యప్రాణుల కళేబరాలు, పెరుగుతున్న పాముల సంతతి తదితర వాటిని నియంత్రిస్తూ ఎప్పటికప్పుడు ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుతున్న గద్దలు ప్రకృతిలో ఎంతో ముఖ్యమైనవి. నల్లమల అభయారణ్యంలో నైతిక ధైర్యంతో మిగతా జీవులకు ఆదర్శంగా నిలిచే గద్దల జీవనశైలి ఎంతో ముఖ్యమైనది. నల్లమలలో క్రెస్టడ్ సర్పెంటీగల్, షార్ట్‌టౌడ్ స్నేక్ ఈగల్, క్రెస్టడ్‌హార్డ్ ఈగల్, బోనెల్లీస్ ఈగల్, శిఖర, బ్లాక్ షోల్డర్ కైట్, బ్లాక్ ఈగల్ లాంటి గద్ద జాతులు సంచరిస్తుంటాయి.

పర్యావరణాన్ని సంరక్షించే గద్ద జాతులు:

నల్లమల అభయారణ్యంలో ఎన్నో రకాల వన్యప్రాణులతో పాటు, ఆకాశంలో సంచరించే పక్షి జాతులు కూడా ఎక్కువే. పక్షి సంతతిలో అత్యంత ముఖ్యమైనవిగా ప్రాచుర్యం పొందిన గద్దలు ప్రకృతిని, పర్యావరణాన్ని సంరక్షించి వాతావరణాన్ని సమతుల్యంగా ఉండేందుకు దోహద పడుతున్నాయి. ప్రకృతిలో ఎక్కువవుతున్న పాములు, క్రిమి కీటకాలు, మిడతలు, కుందేళ్లు తదితర వాటిని ఆహారంగా తీసుకోవటంతో పాటు నల్లమలలో జంతువులు వేటాడిన మృతకళేబరాలను భక్షిస్తూ ఎప్పటికప్పుడు నల్లమలను స్వచ్ఛంగా ఉంచేందుకు దోహద పడుతున్నాయి. సహజంగా మాంసాహార జాతులైన గద్దలు కొనతేలిన ముక్కు, పొడవైన రెక్కలతో, ఎంత బరువున్న ఆహారాన్నైనా సునాయాసంగా



తేనెను సేవిస్తున్న హనీ బజార్డ్...

తీసుకెళ్లే నైపుణ్యం కలిగి ఉంటాయి. వీటిలో ముఖ్యంగా క్రెస్టడ్ సర్పెంటీగల్, షార్ట్‌టౌడ్ స్నేక్ ఈగల్‌లు దట్టమైన అభయారణ్యంలోని గడ్డి మైదానాలను, ఆ ప్రాంతంలో సంచరిస్తున్న పాములను గుర్తించి వాటిని గురి చూసి వేటాడటం వీటి ప్రత్యేకత. క్రెస్టడ్‌హార్డ్ ఈగల్, బోనెల్లీస్ ఈగల్‌లు అభయారణ్యంలోని కుందేళ్లను ఎక్కువగా వేటాడి చంపుతుంది. ఒక్కో సారి గొర్రెలు, మేకల పిల్లలను సైతం అవలీలగా ముక్కున కరుచుకుని పోయేటంత బలం వీటికి ఉంటుంది. శిఖర, బ్లాక్ షోల్డర్ కైట్, బ్లాక్ ఈగల్ తదితర రకాల గద్దలు మాత్రం మిడతలు, తొండలు, కీటకాలను ఆహారంగా తీసుకుని జీవనాన్ని కొనసాగిస్తాయి. నల్లమలలో

> **ఆ గద్దకు తేనే ఆహారం**
>
> హనీ బజార్డ్‌లు తేనెను మాత్రమే తాగి జీవించే గద్దజాతి పక్షులు. అభయారణ్యంపై సంచరిస్తూ ఎక్కడ తేనె నిల్వలు ఉన్నా అక్కడ వాలి తేనెను సేకరించటం వీటి ప్రత్యేకత. కొన్ని గద్ద జాతులు పాములు, సరీసృపాలు, కీటకాలను భక్షించి పర్యావరణ సమతుల్యతను కాపాడుతుంటాయి. గద్దలు నైతిక ధైర్యానికి ప్రతీకలు. ఇవి జీవితంలో కఠినమైన ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొని విజయాన్ని సాధిస్తాయి.
>
> – షేక్ మహమ్మద్ హయాత్, ఫారెస్టు రేంజి అధికారి, శ్రీశైలం బయోడైవర్సిటీ.



అభయారణ్యంలో సంచరించే శిఖర గద్దలు

తేనె మాత్రమే తినే హనీ బజార్డ్

నల్లమల అభయారణ్యంలో మిగతా గద్దలకు విభిన్నంగా తేనెను మాత్రమే సేవించి తమ జీవనాన్ని గడిపే గద్దలు ఉన్నాయంటే ఎవరికైనా ఆశ్చర్యమనిపిస్తుంది. అలా జీవించే గద్దలే హనీ బజార్డ్. వీటి జీవనశైలి ఎంతో విచిత్రమైంది. ఇవి నల్లమల అభయారణ్యం యావత్తూ ఆకాశంలో సంచరిస్తుంటాయి. వీటి ప్రయాణంలో ఎక్కడైనా తేనె తుట్టెలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే అవి అక్కడ వాలి తేనెను సేకరిస్తుంటాయి. ఈ క్రమంలో అవి వాటి భారీ రెక్కలను విసురుతూ తేనెటీగలను తరిమి వేస్తాయి. ఆకాశం గుండా సంచరిస్తూ ఎంత దూరంలోని తేనె తుట్టలనైనా గుర్తించటం హనీ బజార్డ్‌ల ప్రత్యేకత. ఇవి తేనె తప్ప మిగతా ఎటువంటి ఆహారాన్ని ఇష్టపడవు.

సంచరించే గద్దలపై శ్రీశైలం ప్రాజెక్టు బయోడైవర్సిటీలో ఎన్నో రకాల పరిశోధనలు జరుగుతున్నాయి.

నైతిక ధైర్యానికి నిదర్శనం:

సహజంగా 70 ఏళ్ల పాటు జీవించే గద్దలకు 40 ఏళ్లు వచ్చే సరికి ఎన్నో జీవన్మరణ సమస్యలు ఎదురవుతాయి. ఆ సమయంలోనే అవి ఎంతో మానసిక స్థైర్యంతో తమ సమస్యను ఎదుర్కొని పునర్జన్మ ఎత్తి మరో ముప్పై ఏళ్ల పాటు జీవిస్తాయి. సాధారణంగా పొడవుగా, వాడిగా, పదునుగా ఉండే దాని ముక్కు నిరంతర రాపిడి వల్ల అరిగిపోతుంది. వాడిగా, పొడవుగా ఉండి సులభంగా ఒంగి ఆహారాన్ని తీసుకు పోయేందుకు ఉపకరించే కాలి గోళ్లు సైతం తమ సామర్థ్యాన్ని కోల్పోతాయి. దీంతో పాటు పెరిగిన వయసు వల్ల బరువైన రెక్కలు, దట్టమైన ఈకలు దాని గుండెకు హత్తుకు పోయి ఎగరటంలో కష్టాన్ని కలిగిస్తాయి. దీంతో నిర్వీర్యమైన పరిస్థితిలో ఉన్న గద్దలు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని శరీర పునర్నిర్మాణాన్ని చేపడతాయి. ఆ క్రమంలో అవి ఎత్తైన పర్వతాల మీదకు చేరుకుని అక్కడ కొండ రాళ్లకు తన ముక్కును ఢీకొడుతూ దాన్ని రాల్చి కొత్త ముక్కు వచ్చేంత వరకు వేచి ఉంటాయి. కొత్త ముక్కు రాగానే దాని సహాయంతో దాని పాత రెక్కలను పీకేసి కొత్త రెక్కలు వచ్చే వరకు వేచి ఉంటాయి. ఇలా ఐదు నెలల పాటు ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొని నైతిక ధైర్యంతో దాని జీవిత కాలాన్ని మరో 30 ఏళ్ల వరకు పొడిగించుకుంటాయి.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- ఏనుగులదిన్నెపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని ఏనుగులదిన్నెపాడు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతుండటంతో ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే సంకల్పంతో జగనన్న అడుగులు వేస్తున్నారని, పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలో కూడా అమలవడం లేదన్నారు. జగనన్న ప్రభుత్వానికి గడప గడపలో అపూర్వ ప్రజాదరణ లభిస్తోందన్నారు.

కార్యాలయాలు ప్రారంభం:

గ్రామంలో జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణలో రూ.194.21 లక్షలతో నిర్మించిన బాలికల వసతి భవనం, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించి రైతు భరోసా కేంద్రాల భవనం, నాడు-నేడు పథకం ద్వారా రూ 66.90 లక్షలతో జెడ్పీ పాఠశాలలో మరమ్మతు చేసిన తరగతి గదుల భవనాలను మంత్రి ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులతో విద్యపై ఆరా తీశారు. మంత్రి మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు అందించడమే కాకుండా ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తున్నామని వివరించారు. జగనన్న వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు ఇంటి వద్దనే పారదర్శక పాలన అందించి పేదల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. రైతు భరోసా కేంద్రాలు రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామాగా, దిక్సూచిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారని తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గ్రామానికి చెందిన కాటారి అశోక్‌కు తలసీమియా వ్యాధి పింఛన్ రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్ బలుసుపాటి లూథీయా, ఎంపీటీసీ ఏర్వ వెంకటనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ సాయికుమార్, ఏఈ రమేష్, డాక్టర్ వీరనారాయణరెడ్డి, ఏఓ బుజ్జిబాయి, ఏపీఓ సాంబశివరావు, ఏపీఎం శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీనివాసరావు, నాయకులు చిమట వెంగయ్య, వైవీ శివారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వలంటీర్లు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఇమ్మడిచెరువు విద్యార్థి



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి

వెలిగండ్ల: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఇమ్మడిచెరువు విద్యార్థి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ గురుప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు నంద్యాలలో జరిగాయి. ఈ పోటీల్లో ఇమ్మడిచెరువు జెడ్పీహైస్కూల్‌కి చెందిన క్రీడాకారుడు ముక్కు ప్రసాద్‌రెడ్డి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. క్రీడాకారుడు ప్రసాద్‌రెడ్డిని హెచ్ఎం జీ ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి



ఆటగాళ్లను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

అట్టహాసంగా ప్రారంభమైన సాక్షి ప్రీమియర్ లీగ్

- ప్రారంభించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి
- సామాజిక బాధ్యతగా క్రీడలను ప్రోత్సహించడంపై 'సాక్షి' మీడియాకు అభినందనలు
- సిక్సర్లు, బౌండరీలతో హోరెత్తించిన క్రీడాకారులు

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

SPL
SAKSHI PREMIER LEAGUE

Regional sponsor
APMDC
APMDC FOUNDATION

ఒంగోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు స్థానిక మినీ స్టేడియంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు క్రికెట్ ఆడారు. బాలినేని మాట్లాడుతూ సాక్షి మీడియా సామాజిక బాధ్యతగా క్రీడలను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఏటా పోటీలు నిర్వహిస్తూ ఏపీ-తెలంగాణలో అతిపెద్ద క్రికెట్ చాంపియన్‌షిప్ నిర్వహించడం శుభపరిణామమన్నారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏపీ సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ఎనలేని ప్రోత్సాహాన్నిస్తోందని, ఇదే సమయంలో 'సాక్షి'తో పాటు ఇతర సంస్థలు కూడా ఇటువంటి క్రీడాపోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తరచుగా పోటీలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. సాక్షి బ్రాంచి మేనేజర్ శివన్నారాయణ మాట్లాడుతూ సాక్షి ప్రీమియర్ లీగ్ పోటీలను స్థానిక మినీ స్టేడియంలో ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఫైనల్ పోటీలను ఈనెల 7వ తేదీ ఇదే స్టేడియంలో నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం బాలినేనిని బ్రాంచి మేనేజర్ శివన్నారాయణ, బ్యూరో ఇన్‌చార్జి ఎన్.మాధవరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి రవిచంద్ర, సాక్షి టీవీ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాస్, సాక్షి అడ్వర్టయిజ్‌మెంట్ ఒంగోలు ఇన్‌చార్జి శర్మ, సాక్షి సర్క్యులేషన్ ఇన్‌చార్జి పవన్ తదితరులు పాల్గొని బాలినేనిని ఘనంగా సత్కరించారు.

తొలి రోజు హోరెత్తిన బౌండరీలు, సిక్సర్లు:

సాక్షి ప్రీమియర్‌లీగ్‌లో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. పది ఓవర్ల పరిమిత స్థాయి మ్యాచ్‌లో మొత్తంగా క్రీడాకారులు 50 బౌండరీలు, మూడు సిక్సర్లతో హోరెత్తించారు.

■ తొలి మ్యాచ్ పేస్ ఇంజినీరింగ్ కాలేజీ- క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ జట్ల మధ్య జరిగింది. టాస్‌ను బాలినేని వేశారు. టాస్ గెలిచి క్విస్ కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఒక్క పరుగుకే రెండు వికెట్లు కోల్పోవడంతో ఆచితూచి ఆడారు. నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోగా అందులో నలుగురు రనౌట్ అయ్యారు. క్విస్ కాలేజీ జట్టు 8 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేయగా 52 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పేస్ కాలేజీ జట్టు 8 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. క్విస్ క్రీడాకారులు 5 బౌండరీలు కొడితే, పేస్ క్రీడాకారులు 8 బౌండరీలు బాదేశారు. దీంతో పేస్ కాలేజీ జట్టు 8 వికెట్ల తేడాతో విజయకేతనాన్ని ఎగురవేసింది.

రెండో మ్యాచ్ విజేత శ్రీహర్షిణి:

రెండో మ్యాచ్ శ్రీహర్షిణీ డిగ్రీ కాలేజీ-ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎస్ఎస్ఎన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన శ్రీహర్షిణి క్రీడాకారులు పది ఓవర్లలో 12 బౌండరీలు, ఒక సిక్సర్‌తో సహా 102 పరుగులు చేశారు. ఓపెనర్ రవి 29 బంతుల్లో 44 పరుగులు చేశాడు. రవి 6 బౌండరీలు, ఒక సిక్సర్ చేయడం గమనార్హం. అనంతరం 103 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్లు కోల్పోయి కేవలం 75 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో శ్రీహర్షిణి జట్టు 32 పరుగుల భారీ ఆధిక్యంతో విజయాన్ని సొంతం చేసుకుంది.

మూడో విజేత రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ:

తొలిరోజు చివరి మ్యాచ్ చీరాల ఇంజినీరింగ్ కాలేజీ-రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చీరాల ఇంజినీరింగ్ కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 71 పరుగులు మాత్రమే చేశారు. 72 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు కేవలం 5.4 ఓవర్లలోనే 75 పరుగులు చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. ఇందులో దీవన్ అనే బ్యాట్స్‌మన్ 19 బంతుల్లోనే 31 పరుగులు చేసి క్రీడాభిమానుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఇతని ఖాతాలో ఏకంగా మూడు బౌండరీలు, రెండు సిక్సర్లు ఉండడం గమనార్హం.

నేడు జరిగే పోటీలు:

సాక్షి ప్రీమియర్ లీగ్ రెండో రోజు పోటీల వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 8 గంటలకే పోటీలు ప్రారంభించనున్నారు.

సీనియర్స్:

1.డీసీఆర్ఎం-క్విస్ కాలేజీ 2
2.పేస్ కాలేజీ-సెయింట్ ఆన్స్
3.ట్రిపుల్ ఐటీ-హర్షిణి కాలేజీ

జూనియర్స్:

1.పేస్ పాలిటెక్నిక్ కాలేజీ-ఏకేవీకే కాలేజీ



సాక్షి ప్రీమియర్ లీగ్ చాంపియన్ షిప్ క్రికెట్ పోటీలలో గెలుపొందిన పేస్ ఇంజనీరింగ్ కాలేజీ జట్టు



గెలుపొందిన హర్షిణి డిగ్రీ కాలేజీ జట్టు



గెలుపొందిన రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ జట్టు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన ఐదుగురు క్రీడాకారులు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 విభాగంలో దొనకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు జిల్లా తరఫున పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొని సంతనూతలపాడు హైస్కూలుకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్యాస్ లీకై రెండు పూరిళ్లు దగ్ధం


అయ్యగానిపల్లిలో కాలిబూడిదైన పూరిళ్లు

పుల్లలచెరువు: ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతి అయిన ఘటన మండలంలోని అయ్యగానిపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మల్లమ్మ అనే మహిళ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో పక్కనే ఉన్న వస్తువులకు మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో మల్లమ్మ ఇంటి పక్కన ఉన్న ఆశీర్వాదం పూరిల్లు కూడా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయల నగదుతోపాటు ఇళ్లలోని వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సర్పంచ్ లక్ష్మీరవణరెడ్డి, ఐకేపీ ఏపీఎం, మండలంలోని పలువురు విలేకరులు బాధితులకు తమ వంతు సహాయాన్ని అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ప్లాట్‌ఫాం దాటే యత్నంలో ఘటన


నేలపాటి ఆశీర్వాదం (ఫైల్)

సింగరాయకొండ: రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం పోలినేని చెరువు గ్రామానికి చెందిన నేలపాటి ఆశీర్వాదం(71) హైదరాబాద్ వెళ్లి వస్తున్నాడు. రాత్రి ఒంటి గంట సమయంలో చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో రెండో ప్లాట్‌ఫాం నుంచి ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం ఎక్కేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ రైలు ఆశీర్వాదాన్ని ఢీకొట్టింది. దీంతో ఆయన శరీర భాగాలు రైలు పట్టాలతోపాటు ఒకటో నంబరు ప్లాట్‌ఫాం మీద ఎగిరిపడ్డాయి. ఈ దృశ్యాన్ని చూసిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్లాట్‌ఫాంపై పడిన మృతుని శరీర భాగాలను తొలగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రేపు జూడో సబ్ జూనియర్ అండ్ క్యాడెట్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్థానిక అన్నవరప్పాడులోని సూర్య విద్యానికేతన్‌లో జిల్లా స్థాయి జూడో సబ్ జూనియర్స్ అండ్ క్యాడెట్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా అమెచ్యూర్ జూడో అసోసియేషన్ కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు, ఎస్‌ఎస్‌సి మార్కుల జాబితా నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు 4 వెంట తీసుకురావాలన్నారు. 2008, 2009, 2010 సంవత్సరాల్లో పుట్టిన వారు సబ్ జూనియర్స్ కేటగిరీలో, 2005, 2006, 2007 సంవత్సరాల్లో పుట్టినవారు క్యాడెట్ వెయిట్ కేటగిరీలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9398817676, 9948877412ను సంప్రదించాలని కోరారు.

ఆటోలు ఢీకొని ఒకరు మృతి

- 9 మందికి గాయాలు
- మిరప కోత పనులకు వెళ్తున్న సమయంలో ఘటన
- తీవ్ర గాయాలైన వారిని గుంటూరు తరలింపు


ప్రభుత్వ వైద్యశాల వద్ద విషణ్ణవదనంతో వీరభద్రాపురం గ్రామస్తులు


ప్రమాదానికి గురయిన ఆటో

యర్రగొండపాలెం: మిరప కోతలకు వెళ్తున్న కూలీల ఆటోను ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో 9 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని లేళ్లపల్లికి సమీపంలో బుధవారం జరిగింది. యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన 15మంది కూలీలు మిరప కోతల కోసం త్రిపురాంతకం మండలంలోని చెర్లోపల్లికి వెళ్తున్నారు. వీరి ఆటో లేళ్లపల్లి రోడ్డులో వెళ్తున్న సమయంలో పుటుగా మద్యం తాగి ఆటోను అమిత వేగంగా నడుపుతూ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో కూలీల ఆటో పూర్తిగా వెనక్కి తిరగబడటంతో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న సుంకరి చిన్న శ్రీను(40) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న సుంకరి సుందరమ్మ, సుంకరి రమణమ్మ, తెల్లమేకల నారాయణ, కాయకాకుల బాదరమ్మలకు తీవ్రంగా గాయాలు కావడంతో పాటు వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు, మార్కాపురం వైద్యశాలలకు తరలించారు. సుంకరి కొండమ్మ(మృతుడి భార్య), బొమ్మనబోయిన బాదరమ్మ, తెల్లమేకల నాగమ్మ, తెల్లమేకల పున్నమ్మ, హరికృష్ణలు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మృతుడు సుంకరి చిన్న శ్రీనుకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

తొలిరోజే మృత్యు ఒడిలోకి...

బేల్దారి పనిలో నిపుణుడైన సుంకరి చిన్న శ్రీను మిరప కోతలకు బయలు దేరాడు. అలవాటు లేని పనికి వెళ్లవద్దని కుటుంబ సభ్యులు చెప్పినా భార్యతో పాటు కూలీ పనులకు వెళ్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని వచ్చని అతను ఆశించాడు. అయితే చెర్లోపల్లికి కూతవేటు దూరంలో ఉన్న మిరప తోటలోకి వెళ్లి పనులు ప్రారంభించే లోపు మృత్యువు శ్రీనును తన ఒడిలోకి తీసుకుంది. భార్య కొండమ్మ తీవ్ర గాయాలతో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. తన భర్త మరణించాడన్న విషయం తెలియక అమాయకంగా అక్కడికి వెళ్లిన వారిని చూడటం కలచివేసింది. సంఘటన తెలిసిన వెంటనే వెంకటాద్రిపాలెం గ్రామస్తులు ప్రభుత్వ వైద్యశాలకు చేరారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎంఆదిశేషు క్షతగాత్రులను పరామర్శించారు. ఈ కేసును త్రిపురాంతకం సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సై జి.వెంకటసైదులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.






మృతి చెందిన సుంకరి చిన్న శ్రీను   గాయపడిన సుంకరి కొండమ్మ, బొమ్మనబోయిన బాదరమ్మ, తెల్లమేకల నాగమ్మ, పున్నమ్మ

అన్నా పథకాలన్నీ వస్తున్నాయా..?


ఎమ్మెల్యే కేపీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

- లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- ఉత్సాహంగా సాగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం టౌన్: అన్నా బాగున్నావా..పింఛన్ వస్తుందా..? మీ ఇంట్లో అర్హులకు ప్రభుత్వ పథకాలు వస్తున్నాయా..? అక్క ఆసరా పథకం వచ్చిందా.. అంటూ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి బుధవారం పట్టణంలోని 5వ సచివాలయం పరిధి 8వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులను ఆరా తీశారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వార్డులోని ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేపీ ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిని గజమాలతో సత్కరించి గడప గడపకు తిరిగారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి నవరత్నాల పథకాలు వస్తున్నాయన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే వలంటీర్‌లు, సచివాలయం సిబ్బందిని సంప్రదింస్తే సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. సచివాలయం వ్యవస్థతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా మీ వార్డులో ఉన్న సచివాలయానికి వెళితే అక్కడే నిర్ణీత గడువులో మీకు కావాల్సిన సేవలు అందతాయన్నారు. ఆర్థికంగా ప్రతి ఒక్కరూ బాగుండాలనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ రైతు భరోసా, ఆసరా, జగనన్న విద్యదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలన్నీ అమలు చేస్తున్నారన్నారు. వార్డులోని ప్రజలు ఎమ్మెల్యే కేపీపై పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్‌లు దొడ్డా భాగ్యలక్ష్మి, నాగిరెడ్డి, కొత్త కృష్ణ, సిరాజ్, షెక్షావలి, డాక్టర్ కనకదుర్గ, హర్షిత బాబీ, నాగఅరుణ, వై.రంగలక్ష్మమ్మ, వనజాక్షి, రోజ్ లీడియా, భాను, కాలువ దుర్గా, గుంటక వెంకటరెడ్డి, అమిరుల్లాఖాన్, సలీం, మయూరి కాశిం, జి.చెన్నారెడ్డి, ఉత్తమ్ కుమార్, డి.ప్రసాద్, బొబ్బిలి శ్రీనివాసరెడ్డి, ముసలారెడ్డి, దొడ్డా వేణు, ముంగమూరి శ్రీనివాసులు, కరీంబాషా, కరీముల్లా, కె.శివారెడ్డి, వై.రంగయ్య, డీఈ సుభానీ, ఏఈలు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఇతర నేతలు


పొగాకు పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్‌తో ఎంపీపీ

- ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు (మద్దిపాడు): పార్టీలతో సంబంధం లేకుండే అర్హులందరికీ నేరుగా పథకాలు అందుతున్నాయని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని టి.అగ్రహారంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారునికి అందజేస్తున్నారన్నారు. సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుంటే పచ్చ మీడియాకు అవేమీ కనిపించకుండా అబద్ధ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ ఠంచన్‌గా ఇంటి వద్దకే ఇచ్చి వెళుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే వచ్చేదని, అది కూడా ఆ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే ఇచ్చేవారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అర్హులందరికీ పార్టీలు చూడకుండా పెన్షన్లు మంజూరు చేశారన్నారు. ముందుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే టి. అగ్రహారం గ్రామానికి చేరగానే పార్టీ ఎంపీటీసీ సభ్యుడు పాద పవన్ శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.

పొగాకు రైతులకు మంచి ధర కల్పించేందుకు కృషి

గ్రామంలో పొగాకు రైతులు పండించిన మేలిమి రకం పొగాకును రైతులు పలువురు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, భారత పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డిలకు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం ఎంత దూరమైనా వెళ్తామని పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి వ్యాపారులు సిండికేట్ కాకుండా చూస్తామన్నారు. అవసరం అయితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతామని పొగాకు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదల రత్నభారతి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, మాజీ అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్ చెన్నకేశవులు, దుంపా యలమందారెడ్డి, జెట్టి శ్రీను, ప్రసన్న, మద్దిసాని నాగేశ్వరరావు, ఇమ్మిశెట్టి బాలకృష్ణ, సర్పంచ్‌లు సురేష్ అశోక్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, పాద శ్రీధర్, బుర్రా శ్రీనివాసరావు, కంచర్ల సుధాకర్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినీ ట్రక్ బోల్తా

అద్దంకి రూరల్: కూలీలున్న నాలుగు చక్రాల మినీ వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో 25 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అద్దంకి సమీపంలోని కలవకూరు ఇటుక బట్టీ వద్ద చోటు చేసుకుంది. క్షతగాత్రుల సమాచారం మేరకు.. మార్టూరు మండలం ద్రోణాదులకు చెందిన 38 మంది కూలీలు ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల గ్రామంలోని పొలాల్లో మిరపపంటను కోసేందుకు బుధవారం ఉదయం వచ్చారు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళుతుండగా అద్దంకి సమీపంలోని కలవకూరు ఇటుక బట్టీల వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా ఓ బైకు అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో కూలీలున్న నాలుగు చక్రాల ట్రక్ బోల్తా కొట్టడంతో అందులోని 25 మందికి గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికుల సమాచారంతో అద్దంకి, సంతమాగులూరు 108 వాహనాల ద్వారా క్షతగాత్రులను అద్దంకి వైద్యశాలకు తరలించారు. ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సీఐ రోశయ్య వైద్యశాలకు వచ్చి వివరాలను తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

వెలిగండ్ల: మండల పరిధిలోని పద్మాపురం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రుని ఒంగోలు తరలించిన విషయం తెలిసిందే. ఒంగోలులో చికిత్స పొందుతూ క్షతగాత్రుడు జవ్వాజి చిన నాగయ్య (60) బుధవారం సాయంత్రం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు.

ఆధార్ ముఖ గుర్తింపుతో వైఎస్సార్ పెన్షన్ కానుక


ఒంగోలులోని కొణిజేడు బస్టాండ్ సచివాలయం పరిధిలో ఆధార్ ముఖ గుర్తింపుతో పింఛను ఇస్తున్న డీఆర్‌డీఏ ఏపీఓ జి.వరప్రసాద్, వెల్ఫేర్ సెక్రటరీ, వలంటీర్

- వృద్ధులకు బయోమెట్రిక్ పడకపోతే ఈ విధానం అమలు
- జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మూడు ప్రాంతాల్లో పెన్షన్ పంపిణీ

ఒంగోలు సబర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో సాంకేతికపరమైన అవాంతరాలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బయోమెట్రిక్ బదులుగా ఆధార్ ముఖ గుర్తింపుతో పెన్షన్ పంపిణీ చేసే విధానానికి ప్రకాశం జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లాలోని మూడు ప్రాంతాల్లో వేలి ముద్రలు పడని వృద్ధులకు నూతన విధానంలో పింఛను సొమ్ము అందజేశారు. జిల్లాలో ఒంగోలు నగరంలోని కొణిజేడు బస్టాండ్ వార్డు సచివాలయం పరిధితోపాటు సంతనూతలపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామ సచివాలయం, సీఎస్‌పురం మండలం దర్శిగుంటపేట గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ ముఖ గుర్తింపుతో పెన్షన్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని అధికారులు పర్యవేక్షించారు. వృద్ధులకు చెందిన వేలి ముద్రలు మూడుసార్లు పడకపోతే ఆ తర్వాత ఆధార్‌ను ఆధారం చేసుకుని ముఖ గుర్తింపుతో వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. పైలెట్ ప్రాజెక్టుగా నిర్ణయించిన ప్రాంతాల్లో ముఖ గుర్తింపుతో పెన్షన్ ఇచ్చే కార్యక్రమం విజయవంతమైంది. నగరంతో పాటు బొడ్డువానిపాలెంలో డీఆర్‌డీఏ ఏపీఓ డాక్టర్ జి.వరప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఒంగోలు కొణిజేడు బస్టాండ్ సెంటర్ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ నాగమణి, వలంటీర్లు యశ్వంత్, ప్రసాద్, ఎస్.అనిల్ కుమార్ పాల్గొన్నారు. కాగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 2,29,930 పింఛన్లను పంపిణీ చేసి 80.42 శాతం పూర్తి చేశారు.

మాలకొండ దుకాణాల వేలం ఆదాయం రూ.80.22 లక్షలు


బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్న దేవాలయాల అధికారులు

వలేటివారిపాలెం: మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం షాపులకు సంబంధించి బుధవారం బహిరంగ వేలం నిర్వహించగా రూ.80.22 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. వేలంపాటలో వాహన పార్కింగ్‌కు రూ.23.52 లక్షలకు బచ్చు తిరుపాలు దక్కించుకున్నారు. అమ్మవారి చీరలు, జాకెట్లు మద్దులూరి మాల్యాద్రి రూ.24.50 లక్షలకు దక్కించుకున్నారు. శీతలపానియాలు సిమల దిన్నె వెంగయ్య రూ.10లక్షలకు పాట దక్కించుకున్నారు. పలహారశాల కుర్ర మనోహర్ రూ.8.50 లక్షలకు సొంతం చేసుకున్నారు. పాదరక్షలు, పాలు, నెయ్యి బచ్చు వెంగల్రావు రూ.13.16 లక్షలకు పాడుకున్నారు. ఫ్యాన్సీ దుకాణాలు రూ.13.69 లక్షలు, రూ.3.15 లక్షలకు పాడుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.20.74 లక్షల అదనపు ఆదాయం వచ్చినట్లు తెఇలపారు. తలనీలాలు, రెండు కొబ్బరికాయ అంగడ్లు, కొబ్బరి చిప్పలు పొగుచేసుకునటకు హక్కు, అద్దాలు ఫొటో షాప్‌లకు వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదన్నారు. వాయిదా పడిన దుకాణాలకు తిరిగి ఈ నెల 10న వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఇతర దేవాలయాల ప్రత్యేక అధికారులు వై భైరాగి, రవికుమార్ సమక్షంలో పాట నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.